క్లుప్తంగా

మద్యం షాపు తనిఖీ



మద్యం షాపును తనిఖీ చేస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వాల్మీకి సర్కిల్ వద్ద ఉన్న మద్యం షాపును ఎస్ఐ రమేష్‌బాబు మంగళవారం తనిఖీ చేశారు. షాపుల వద్ద తాగి గొడవ పడితే చర్యలు తప్పవని మందుబాబులను హెచ్చరించారు. ఇళ్లు, పాఠశాలలు, ఆలయాల వద్ద మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన నాగప్ప

రొద్దం: మండల పరిధిలోని సుబ్బరాయప్ప కొట్టాల గ్రామ సమీపంలో పావగడ-పెనుకొండ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రొద్దకంపల్లికి చెందిన నాగప్ప తీవ్రంగా గాయపడ్డారు. ద్విచక్ర వాహనంలో పెనుకొండ వైపు వెళుతున్న నాగప్ప, అశోక్‌ను పెద్ద కోడిపల్లికి చెందిన కారు ఢీ కొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అశోక్‌కు స్వల్ప గాయాలు కాగా, నాగప్ప తీవ్రంగా గాయపడ్డాడన్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును బూచెర్ల వద్ద పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

పావగడ: అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ అధికారులకు సూచించారు. స్థానిక టీపీఎస్ సభాగణంలో మంగళ వారం నిర్వహించిన త్రైమాసిక ప్రగతి పరిశీలన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక సబ్ రిజిస్ట్రార్ రాధ వైఖరిపై ఎమ్మెల్యే మండి పడ్డారు. సోలార్ భూముల్ని రిజిస్టర్ చేయించే సమయంలో దళారీల గ్యాంగ్‌లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మర్చుకోకపోతే ఇక్కడి నుంచి మారాల్సివస్తుందని హెచ్చరించారు. అనంతరం పశు గణన పోస్టర్లను ఎమ్మెల్యే విడుదల చేశారు.

పాఠశాలలు తనిఖీ




గౌడనకుంట ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీవైఈఓ రంగస్వామి

అమరాపురం: మండలంలోని వి.అగ్రహారం, గౌడనకుంట, హలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను డీవైఈఓ రంగస్వామి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

నాయీ బ్రాహ్మణులకు క్షమాపణ చెప్పాలి

హిందూపురం టౌన్: నాయీ బ్రాహ్మణులను కించపరిచే విధంగా వైఎస్సార్ జిల్లాలో పత్రికా సమావేశం నిర్వహించిన డాక్టర్ జిలాన్ బాషా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని సవిత మహర్షి నాయీ బ్రాహ్మణ సేవా సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘంతో పాటు నాయీ బ్రాహ్మణులు విలేకరులతో మాట్లాడారు. రాజకీయ విమర్శలు చేసుకోవాలని, నాయీ బ్రాహ్మణులను దూషించడం మంచి పద్ధతి కాదన్నారు. ఆ సంఘం అధ్యక్షుడు బీఎన్ మూర్తి, కార్యదర్శి నాగేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, గౌరవాధ్యక్షుడు డిస్కో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాళికాదేవికి ప్రత్యేక పూజలు



కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

అగళి: కార్తీక మంగళవారం సందర్భంగా మండల కేంద్రంలోని కాళికాంబదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

సమీపిస్తున్న సాగునీటి సంఘాల ఎన్నికలు

- 23న ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
- మడకశిర నియోజకవర్గంలో 47 సాగునీటి సంఘాలు
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం
- సాగునీటి సంఘాలపై అధికారపార్టీ నాయకుల కన్ను

మడకశిర: నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఈనెల 23న నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. నియోజకవర్గంలో 47 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఎన్నికలకు కేవలం పది రోజుల గడువు మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో సాగునీటి సంఘాల ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. పార్టీ రహితంగా ఈఎన్నికలను నిర్వహిస్తున్నారు. అయినా ఈఎన్నికలకు రాజకీయ రంగు పులుపుకుంటోంది. ప్రధానంగా టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. తమ మద్దతుదారులను ఎన్నికల్లో నిలబెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

282 ప్రాదేశిక నియోజకవర్గాల ఏర్పాటు

ప్రతి సాగునీటి సంఘానికి 6 చొప్పున ప్రాదేశిక నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు. మొత్తం 47 సంఘాలకు 282 ప్రాదేశిక నియోజకవర్గాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాదేశిక నియోజకవర్గాలకు ఓటర్లను కేటాయించారు. తొలుత ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆరుగురిని ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఎన్నుకుంటారు. ఆ తర్వాత ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులుగా ఎన్నికైన వారు సాగునీటి సంఘం అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. మడకశిర మండలంలో 12 సంఘాలకు 72, గుడిబండ మండలంలో 9 సంఘాలకు 54, అమరాపురం మండలంలో 14 సంఘాలకు 84, రొళ్ల మండలంలో 5 సంఘాలకు 30, అగళి మండలంలో 7 సంఘాలకు 42 చొప్పున ప్రాదేశిక నియోజకవర్గాలను అధికారులు ఏర్పాటు చేశారు.

అధికార పార్టీ నాయకుల కన్ను

నియోజకవర్గంలోని అన్ని సాగునీటి సంఘాలపై అధికార పార్టీ నాయకులు కన్నేశారు. ఎలాగైనా సరే ఈసాగునీటి సంఘాలన్నీ కైవసం చేసుకుని పట్టుసాధించాలని టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా మైనర్ ఇరిగేషన్ చెరువులపై సాగునీటి సంఘాలకే పూర్తి అధికారం ఉంటుంది. చెరువుల అభివృద్ధికి వచ్చే నిధులపై కూడా సంఘాలకే అధికారం ఉంటుంది. సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలోనే చెరువుల అభివృద్ధికి నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీంతో అధికార పార్టీ నాయకులు సాగునీటి సంఘాలను కైవసం చేసుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నాలు ప్రారంభించారు. గతంలో కూడా టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులు సాగునీటి సంఘాలకు వచ్చిన నిధుల ద్వారా భారీగా లబ్ధిపొందారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో సహకరించాలని పోలీసులు, సంబంధిత అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

ఓటరు జాబితాలను సిద్ధం

సాగునీటి సంఘాల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఓటరు జాబితాలను సిద్ధం చేశారు. ఇప్పటికే జాబితాలను సచివాలయాల ఎదుట ప్రదర్శించారు. నియోజకవర్గంలో అన్ని సాగు నీటి సంఘాల పరిధిలో మొత్తం 15,023 మంది ఓటర్లు ఉన్నారు. మడకశిర మండలంలో 4,119, గుడిబండలో 1,683, అగళి మండలంలో 1,770, అమరాపురంలో 6,706, రొళ్ల మండలంలో 749 చొప్పున ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో బ్యాలెట్ విధానం ఉండదు. కేవలం చేతులెత్తి ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులు, అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుంది.



మడకశిరలోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయం

సాగునీటి సంఘాల వివరాలు ఇలా..

మడకశిర మండలం
చందకచర్ల, ఛత్రం, దయ్యాలపల్లి, గౌడనహళ్లి, హరేసముద్రం, కల్లుమర్రి, ఎల్లోటి, సీ కొడిగేపల్లి, మడకశిర, మణూరు, ఉప్పిడిపల్లి, వైజీహళ్లి

గుడిబండ మండలం
రాళ్లపల్లి, మందలపల్లి, నాచేపల్లి, కొంకల్లు, ముతుకూరు, మోరుబాగల్, తాళికెర, గొల్లపల్లి, గుడిబండ

రొళ్ళ మండలం
రొళ్ల, కే బ్యాడిగెర, కాకి, హునిసేకుంట, ఎంరాయాపురం

అమరాపురం మండలం
అమరాపురం, చిట్నడుకు, దొడగట్ట (హల్కూరు), ఉదుగూరు, గౌడనకుంట, తమదేపల్లి, హెంజేరు (హేమావతి), కొలిపిరంగస్వామి, పొన్నకట్ట, పురవరం, నాగోనహళ్లి, శివరం, నిడ్రగట్ట, వలస

అగళి మండలం
అగళి, ఇనగలూరు, మధూడి, హళ్లికెర, కోడిపల్లి, ఇరిగేపల్లి, రావుడి

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి



సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. అప్రజాస్వామ్యక పద్ధతిలో ఈఎన్నికల్లో గెలవడానికి అధికార పార్టీ నాయకులు ప్రయత్నించే అవకాశం ఉంది. పోలీసులు, ఎన్నికల అధికారులు అలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. అధికారులు ఈఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోకపోతే ఊరుకునే ప్రసక్తే ఉండదు.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నాం



సాగునీటి సంఘాల ఎన్నికలకు అవసరమైనే ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే ఓటరు జాబితాలను సిద్ధం చేశాం. ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా ఓటర్లను విభజించాం. ఓటరు జాబితాలను సచివాలయాల వద్ద ప్రదర్శించాం. వన్ బీలో ఉన్న ప్రతి రైతు పేరునూ ఓటరు జాబితాలో చేర్చాం. ఎన్నికలను కూడా ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– కరుణాకర్, తహసీల్దార్, మడకశిర

'సూపర్ సిక్స్'కు నిధులేవీ?

- వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపికా



హిందూపురం: అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజలకు నిరాశకు గురిచేసిందని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వకర్త టీఎన్ దీపికా అన్నారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు గుప్పించి గద్దె నెక్కిన టీడీపీ వాటి ఊసే ఎత్తకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల అమలుకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదన్నారు. అలాగే 19 నుంచి 50 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని కూడా అటకెక్కించారన్నారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ ఎక్కడ ? అని ప్రశ్నించారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ పథకాలకు పెద్దపీట వేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం తమ హామీలను తుంగలో తొక్కి అరకొర కేటాయింపులు చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలు ఉత్తుత్తువేనని బడ్జెట్ చూస్తేనే తెలుస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు.

క్షతగాత్రులకు పోలీసు సిబ్బంది సాయం

పెనుకొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరికి పోలీసు సిబ్బంది సాయం చేశారు. వివరాల్లోకెళితే... పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద రెండు బైకులు ఢీ కొన్నాయి. దీంతో ఇద్దరికి రక్తగాయాలయ్యాయి. ఆ సమయంలో ఆ దారి గుండా పోలీస్ జీపులో వెళుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది వెంటనే గాయపడిన వ్యక్తులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఎస్ఐతో పాటు సిబ్బందికి బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

చిలమత్తూరు: మండల కేంద్రంలో ద్విచక్ర వాహనానికి పంది అడ్డు రావడంతో కింద పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ద్విచక్ర వాహనంలో సురేష్, మల్లీశ్వరి వెళ్తున్నారన్నారు. అయితే పంది అడ్డు రావడంతో వాహనం అదుపు తప్పిందని తెలిపారు. తీవ్రంగా గాయపడిన సురేష్, మల్లీశ్వరిలను 108 ద్వారా హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మంత్రి సోదరుడు

పెనుకొండ: రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత సమీప బంధువు, సోదరుడైన కురుబ శ్రీనివాసులు నియమితులయ్యారు. దీంతో ఆయనకు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాసులు ప్రస్తుతం రాంపురం సర్పంచ్‌గా పనిచేస్తున్నారు.

స్థల పరిశీలన

పావగడ: పట్టణంలోని వడ్డెర కాలనీలో నూతన అంగనవాడీ కేంద్రం నిర్మాణానికి స్థానిక మున్సిపల్ చైర్మన్ పీహెచ్ రాజేశ్, సీడీపీఓ సునీత మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వడ్డెర కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ రాజేశ్ మాట్లాడుతూ త్వరలోనే అంగనవాడీ కేంద్రం నిర్మాణానికి చర్యలు చేపడతామని మున్సిపల్ చైర్మన్ తెలిపారు.

చదువుతోనే గుర్తింపు

గుడిబండ: స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం 'ఉల్లాస్' కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ గంగాధర్ మాట్లాడుతూ వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే 'ఉల్లాస్' పథకం ఉద్దేశమన్నారు. మండల వ్యాప్తంగా 1600 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారికి వలంటీర్లు విద్యను బోధించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

'సస్యరక్షణ'తో అధిక దిగుబడి

పరిగి: సస్యరక్షణ పద్ధతులను అవలంభించడంతో అధిక దిగుబడి సాధించడంతో పాటు అనేక ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి విజయభారతి తెలిపారు. మండలంలోని చిన్నపల్లిలో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.

నాణ్యతపై దృష్టిసారించండి

మడకశిరరూరల్: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గ్రామాల్లో చేపట్టే సీసీ రోడ్లు నిర్మాణంలో తప్పనిసరిగా నాణ్యత పాటించాలని డివిజన్ క్వాలిటీ కంట్రోల్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో ఐదు మండలాలకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సీసీ రోడ్ల నిర్మాణంలో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించారు. అనంతపురం జిల్లా విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ మల్లికార్జునమూర్తి, డీఈలు నాగేశ్వర్, వెంకటేశులు, ఏఈలు రామకృష్ణ, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరుడిని దర్శించుకున్న డీఎస్పీ

అమరాపురం: హేమావతిలో వెలసిన హెంజార సిద్ధేశ్వరస్వామిని మంగళవారం పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. అనంతరం అమరాపురం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. మడకశిర సీఐ రాజ్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎస్ఐ మునిప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి

పెనుకొండ రూరల్: భూనిర్వాసితులకు ఆర్ అండ్ఆర్ ప్యాకేజ్ అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూనిర్వాసితులతో కలసి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థలైన నాసిన్, బెల్ సంస్థలు పాలసముద్రానికి చెందిన భూనిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీని అమలు చేయ్యాలన్నారు. నాయకులు పెద్దన్న, గంగాధర్, స్వర్ణలత, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ పదవి వాల్మీకులకే కేటాయించాలి

హిందూపురం టౌన్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్‌గా వాల్మీకి కులస్తులను కాదని కప్పట్రాళ్ల సుశీలమ్మను నియమించింది. ఆమెను తొలగించి చైర్మన్‌గా వాల్మీకులకే అవకాశం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిరు వాల్మీకి, పార్లమెంట్ యువజన సంఘం అధ్యక్షుడు నవీన్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

మందకృష్ణ పర్యటన విజయవంతం చేయండి

హిందూపురం టౌన్: అనంతపురం జిల్లా కేంద్రానికి ఈ నెల 16న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్, ఎంఆర్‌పీఎస్ తాలుకా అధ్యక్షుడు సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. మందకృష్ణ సభకు మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పెనుకొండ: పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను అల్ కౌసర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. మైనార్టీ వెల్ఫేర్ డే, జాతీయ విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఫజల్ కరీం ఉత్తమ ఉపాధ్యాయుని పురస్కారం కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా 3వ సారి సుధాకర్ ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో వారిని సన్మానించారు.

కొనసాగుతున్న గ్రామసభలు

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని వివిధ గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు కొనసాగుతున్నాయి. మంగళవారం కూడా గ్రామసభలు నిర్వహించగా స్థానికులు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

వాహనాల సీజ్

సోమందేపల్లి: మండల కేంద్రంలో రెండు బస్సులు, ఓ ట్రాక్టర్‌ను రవాణాశాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. రికార్డులు సక్రమంగా లేకపోవడంతో వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఎల్‌పీఎస్ఆర్ఎస్ కంపెనీకి చెందిన బస్సులు నిబంధనలు పాటించడంలేదని రవాణాశాఖ అధికారులు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని కొట్నూరు రైల్వేగేట్ సమీపంలో మారుతీ అనే వ్యక్తి నుంచి 40 టెట్రా ప్యాకెట్లు, కగ్గల్లుకు చెందిన మూర్తి నుంచి 46 ప్యాకెట్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే మద్యం కేసుల్లో పాత ముద్దాయిలను తహసీల్దార్ ఎదుట హాజరుపర్చగా రూ.లక్ష పూచికత్తుపై విడుదల చేశామన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి

అమరాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంకు అధికారి విరూపాక్షప్ప తెలిపారు. మంగళవారం మండలంలోని తమ్మడేపల్లిలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. కేంద్ర పథకాలను వివరించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి



పెనుకొండ: మాట్లాడుతున్న ఎంపీడీఓ సరేష్‌కృష్ణ

సాక్షిబృందం: గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేయాలని ఎంపీడీఓలు సూచించారు. మంగళవారం హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులకు గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు.

రికార్డులు పరిశీలించిన డీఈఈ

రొళ్ల: స్థానిక గృహనిర్మాణశాఖ కార్యాలయాన్ని మంగళవారం మడకశిర డీఈఈ శివకుమార్‌నాయక్ సందర్శించారు. కార్యాలయ రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే అర్హత కలిగిన వారికి కొత్తగా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. హౌసింగ్ ఏఈ కిశోర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రుద్రప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

హిందూపురం: మండలం చలివెందుల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రవీంద్రరెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి చలివెందులలోని రవీంద్రరెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు అజయ్‌రెడ్డి, రామలింగా, క్రిష్ణ, దాదాపీర్, బాబాజన్ తదితరులున్నారు.

పరిగి చెరువుకు శాంతి పూజ





చెరువు వద్ద శాంతి పూజలు చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) అలంకరణలో సప్పలమ్మ

పరిగి: మండల కేంద్రంలోని పరిగి చెరువుకు మంగళవారం స్థానిక ఎస్సీ కాలనీ వాసుల ఆధ్వర్యంలో శాంతి పూజలు నిర్వహించారు. 32 క్రితం నిండిన పరిగి చెరువు ఇటీవల మరోసారి మరువ పారింది. సంప్రదాయబద్ధంగా వస్తున్న ఆచారం ప్రకారం గుమ్మగట్ట వాసులు ఇప్పటికే పూజలు నిర్వహించారు. అనంతరం తాజాగా పరిగి మండల ఆయుకట్టు రైతులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో చెరువుకు శాంతి పూజలు చేశారు. తొలుత సర్పంచ్ లక్ష్మీదేవి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సప్పలమ్మ అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి పూజలు చేశారు. అనంతరం చెరువు కట్ట ప్రాంతానికి తరలివెళ్లి అక్కడ కట్టకు ఉన్న రెండు ప్రదేశాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీ, లింగమ్మ, శివశంకర్, మాజీ ఎంపీపీ గోవిందప్ప, ఎస్సీ సెల్ కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



హిందూపురం: రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులు



రొద్దం: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారితో ఉపాధ్యాయులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కరాటే పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మోరార్జీ యాదవ్ తెలిపారు. బాలురు అండర్–14లో జాన్ విక్టర్, మహమ్మద్, జై శోభన్, కైఫ్, లవన్ కుమార్, సాజిద్ ఖాన్, సుదీప్‌రెడ్డి, అండర్–17లో మహీధర్‌నాయక్, నూర్‌మహమ్మద్, వేణు తేజ, అకీబ్, రాహుల్, కైఫ్, లక్ష్మీనరసింహారెడ్డి ఎంపికయ్యారు. అలాగే అండర్–14 బాలికల విభాగంలో డింబు, శ్రీఅన్విత, యాసిని, మంజుశ్రీ, గౌరీ, అనన్య సాయి, హిమనీ, యాలిని, జ్ఞాన చరితలు ఎంపికయ్యారు. అండర్–17లో భావన, వర్షిత, నాగ వర్షిత, దీపిక, శరణ్య, సమీరారెడ్డి, హాసినిరెడ్డి, నేహ ఎంపికయ్యారు.

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి మంజునాథ్, పదోతరగతి చదువుతున్న చరణ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం శివరామ్, వ్యాయమ ఉపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. బేస్‌బాల్‌లో మంజునాథ్, సాఫ్ట్‌బాల్‌లో చరణ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. నవంబర్ చివరిలో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు.